రాత్రి పది గంట లయ్యింది.

ఆపేటంతా దాదాపు ప్రశాంతంగా ఉంది.

నిద్ర పోతున్నట్టో..... లేక నిద్రకుపక్రమిస్తున్నట్టో ఉంది. అయితే.... ఆ వీధిలో చకచకా నడుస్తున్న పరశురాం మనసులో మాత్రం ప్రశాంతత లేనేలేదు.


అశాంతి చెలరేగుతోంది.

ఆగ్రహం అంచెలంచెలుగా మరుగుతోంది.

ప్రతీకారం జ్వాలలా మండుతోంది.

చీకటిగా ఉంది బజారు.

నిర్మానుష్యంగా ఉంది.




ఛటుక్కున జేబులోంచి ఓ వస్తువును తీశాడు.

బటన్ ప్రెస్ చేశాడు.

టక్! మంటూ విచ్చుకుంది కత్తి.

తళతళా మెరుస్తోంది.

మౌనంగానే వికటాట్టహాసం చేశాడు పరశురాం.

# రాక్షసి! నాన్నగారి ప్రేయసి!

## వడ్లమన్నాటి కుటుంబరావు

ప్రెస్ బటన్ నైఫ్‌ని ముడిచి నిర్లక్ష్యంగా జేబులో వేసుకున్నాడు.

పుట్టి పెరిగిన ఈ పంథొమ్మిదేళ్ళలో.... తను ఎవరికీ అపకారం తలపెట్టలేదు.

కనీసం ఎవరినీ తిట్టలేదు.

సౌమ్యుడు....! సాధుజంతువు... ! అసమర్థుడు లాంటి బిరుదులు సంపాయించాడు.

తను బి. ఎస్. సి. ఫైనల్ యియర్ అంటే ఎవరూ నమ్మరు!

అంత అమాయకంగా ఉంటాడు తను.

అలాంటిది. తను... ఏకదాటిగా.... ఓ గొప్ప పని చెయ్యబోతున్నాడు.

అది అలాంటి లాంటి అల్లాటప్పా పనికాదు.

ఆషామాషీ పని అంతకంటే కాదు.

నాన్న పాలిట శనిగ్రహంలా.....

అమ్మ పాలిట పిశాచంలా....

తమందరి పాలిట భయంకర మైన పీడ కలలా....

దాపురించిన . .. ఓ ఆడదాన్ని....

ఓ ఉంపుడుగత్తెని....

నాన్న చిన్నిల్లుని....

సమూలంగా నిర్మూలించెయ్యటం.....!

అంటే.....

పచ్చిగా చెప్పాలంటే. ..

హత్య చెయ్యటం....!!!

కత్తి పెట్టి కసుక్కున నరికెయ్యటం!

తనా పని చెయ్యగలడా? అన్న సందేహానికి తావు లేదు.

అంతటి ఘాతుకానికి తను ఒడిగట్ట గలడా? అనే ప్రశ్నేలేదు.

ఎందుకంటే....?

నాన్న చిన్నిల్లు గురించి తనకు చెప్పుకుంటూ.... కుమిలి పోతూ. అమ్మ పడే క్షోభ తనింక చూడలేడు. . భరించలేడు.

పతియే ప్రత్యక్ష దైవంగా భావించి.... సేవలు చేసే అమ్మ హక్కును. . అనాయాసంగా అదెవత్తో లాక్కు పోవటం తను సహించలేడు.


నాన్నని అది అంతగా ప్రేమిస్తే.... నాన్న నొదిలి ఉండలేకపోతే... అప్పుడే వివాహం చేసుకుని... నాన్నకి ఇల్లాలయి ఉండాల్సింది.

అంతేగానీ.... ఇప్పుడు నాన్న జీవితంలోకి తిరిగి ప్రవేశించి.. . అమ్మ జీవితంతో చెలగాటా లాడుతుంటే... చూసి ఊరుకోటానికి తనేమన్నా దద్దమ్మనుకుందా?

అసలు నాన్న సరయిన వాడయితే.... ఈ తిప్పలన్నీ ఎందుకొచ్చేవి?

కానీ.... జన్మ యిచ్చిన తండ్రిని తను మందలించలేడు.

ఈ ఒక్క విషయంలో తప్ప.... నాన్న వస్తుతః చాలా మంచివాడు. తనన్నా.... అమ్మన్నా... ఎంతో ప్రాణం




## రాక్షసి! నాన్నగారి ప్రేయసి!

మధ్యలో ఆ రాక్షసి ప్రవేశించి .... నాన్నని– అమ్మకీ తనకీ కాకుండా చేస్తోంది.

అందుకని దాన్ని అడ్డు తొలగిస్తే? అంతా సుఖాంతం! అమ్మ మనసుకు శాంతి కలిగించిన తరవాత తనేమయి పోయినా పరవాలేదు.

ఆలోచనలు ముగిసే సరికి ఆయింటి ముందు కొచ్చాడు పరశురాం.

వీధంతా నిర్మానుష్యంగా ఉంది.

చిమ్మ చీకటిగా ఉంది.

కీచురాళ్ళ రొదలు వినిపిస్తున్నాయి.

చేత్తో వీధి తలుపుల్ని మెల్లగా నెట్టాడు.

చప్పుడు చెయ్యకుండా తెరుచు కున్నాయి అవి.

ఆ రాక్షసి ఇల్లు..... పదడుగులు లోపలిగా ఉంటుందన్న సంగతి అతనికి తెలుసు.

లోపల లైటు వెలుగుతుంటం గమనించి దాని కాంతి తన మీద పడకుండా జాగ్రత్తగా గోడపక్కకు వెళ్ళాడు పరశురాం.

నాన్న గొంతు వినిపిస్తోంది.

అదోలా నవ్వుకున్నాడు.

నాన్న అలా బయటికి రావటం.... తను.... ఒక్కుదుటున కత్తితో దాని మీదకు లంఘించటం..... కసుక్కున పొట్టలో దించెయ్యటం.... పరలోకానికి పంపించెయ్యటం

ఫినిష్!

చెవులు రిక్కించాడు పరశురాం.

"రత్నా! ప్రాణంతో సమానంగా ప్రేమించిన నిన్ను.... ధనవంతుల అమ్మాయిని నేనెక్కడ సుఖపెట్టగలననే భయంతో.... పిరికి తనంతో.... దూరం చేసుకుని పారిపోయాను. నన్ను మరిచి పోయి.... హాయిగా పెళ్ళి చేసుకుంటా వనుకున్న నా నమ్మకాన్ని వమ్ముచేసి.... అజన్మ బ్రహ్మచారిణిగానే ఉంటా వనుకోలేదు. హాబీకోసం ఉద్యోగం చేస్తూ.... ట్రాన్సరు మీద ఇక్కడకొచ్చి.... మళ్ళ నాజీవితంలో తారస పడతా వనుకోలేదు. ఇక్కడికొచ్చిన ఈ అర్నెల్లలో నాకెంతో ఊరట కలిగించావు. ఆర్థికంగా నన్నెన్ని విధాలో ఆదుకున్నావు. నీ ఈ పరిస్థితికి కారకుణ్ణి నేను. నువ్వు.... నావల్ల జీవితంలో అమరసుఖాల్ని త్యాగం చేశావు. ఇక్కడ కొచ్చిన తరవాత కూడా స్త్రీ సహజమైన సిగ్గు వల్ల నోరువిప్పి అడగలేక పోతున్నావు. ఇంకా ఊరుకుంటే..... నేను నీపట్ల కృతఘ్నుణ్ణి అవుతాను. రా! రత్నా! ఆనందాకాశంలో... సుఖాల ఉయ్యాల లూగిస్తాను. రా!"

కుతకుత ఉడికి పోయాడు పరశురాం. కన్న తల్లి ఈవిషయంలో ఎందుకు పరితపించి పోతోందో అర్థమయ్యిందతనికి.

'కిటికీ చువ్వలు వంచేసో.... తలుపులు పగల గొట్టేసో.... లోపలికి ఉరికి ... దాని మెడ కొరికేస్తే.... ?' అని పించిందతనికి.... ఆ ఆగ్రహంలో.

"మూర్తీ! నన్ను కాదని వెళ్ళి పోయి.... నువ్వు నాగుండెల్లో రగిల్చిన చిచ్చు.... ఇంకా ఆరకుండా మిగిలే ఉంది. ఇంత వరకూ శారీరకంగా పవిత్రంగా ఉన్న మన ప్రేమని.... ఈ పాడు పనితో కళంకితం చెయ్యకు. నిన్ను నీ భార్య దైవంలా చూసుకొంటోందని నువ్వే ఎన్నోసార్లు చెప్పావు. ఆమె గుండెల్లో కుంపటి వెలిగించకు. నేనునీకు ఆర్థికంగా సాయం చేయటం కేవలం స్నేహధర్మం మాత్రమే.

పోతే .. ఒకనాటి ప్రేమికురాలిగా నేను నిన్నో మాట అడుగుతున్నాను. నీకు కృతజ్ఞత ఉంటే ఇవ్వు."

"ఏమిటది రత్నా?"

"నువ్వు నాకు తరచు కనిపిస్తూ మనశ్శాంతి కలిగిస్తుంటే అదే చాలు నా జీవితానికి. నీ భార్య – నేను – తన పండంటి జీవితాన్ని దోచుకుంటున్నానని... మీ అబ్బాయి తన నాన్న దగ్గర డబ్బు దోచుకుంటున్నానని.... నిందించకుండా చూడు"

"రత్నా! రత్నా! నా కాళ్ళు చేతులు కట్టెయ్యకు."

"మూర్తీ! ఆగు. నా మీద నీకే మాత్రం ప్రేమ ఉన్నా ... నా శరీరాన్ని తాకటానికి ప్రయత్నించకు. ఒకవేళ మొండి పట్టు పట్టావో... ఆ కిటికీలో ఉన్న విషం సీసా... నీ ప్రేయసి రత్నని క్షణాల్లో శవంగా మార్చెయ్యగలదు. దయచేసి వెళ్ళు!"

క్షణాల్లో తలుపులు తెరుచుకున్నయ్.

పక్కనే ఉన్న క్రోటన్ గుబురు వెనక నక్కాడు పరశురాం.

హడావుడిగా నాన్న వెళ్ళగానే ఇవతలికి వచ్చాడు.

"ఎవరదీ?" అంది రత్నబాల – భయంగా.

"నేను" అంటూ అమాంతం ఆమె కాళ్ళ మీద పడిపోయాడు పరశురాం. కన్నీటితో అభిషేకం చేశాడు... ఆమె పాదాలకి.

బ్రాన్పడిపోయిన రత్న "ఏమిటి నాన్నా? పరశూ! ఈ వేళప్పుడెందు కొచ్చావ్? ఎందుకిలా ఐదయిపోతున్నావ్?" లేవనెత్తి ... నెమ్మదిగా నడిపించుకుంటూ వెళ్ళి మంచం మీద కూర్చో పెట్టింది. గ్లాసుతో మంచి నీళ్ళిచ్చింది. తాగటం పూర్తి చేసి... వెక్కుతూనే విషయమంతా చెప్పాడు పరశురాం.

వేదాంతిలా నవ్వుతూ అంది రత్న "పొరపాటు చేశావు పరశూ! నువ్వనుకున్నట్టు కానిచ్చి ఉంటే ... అందరి సమస్యలకూ పరిష్కారం లభించి ఉండేదేమో?"

"పిన్నీ! నన్నింకా చంపకు" ఆమె చేతుల్ని తన తల మీదపెట్టుకుంటూ అన్నాడు పరశురాం.

"ఇలాంటి దేవతా మూర్తినా..? నాన్నగారి చిన్నిల్లు! ఉంపుడుగత్తె! లాంటి అసహ్యమయిన భావాలతో ఊహించుకున్నాను. ఇప్పుడే వెళ్ళి అమ్మకు చెపుతాను. నీ పట్ల ఆమె ఊహలు తప్పు. మంచి పిన్నిగా నీకు మా ఇంటికి రాకపోకలు ఏర్పాటు చేస్తాను.... వస్తాను" అంటూ దూకుడుగా వెళ్ళిపోయాడు పరశురాం.

"బాబూ! నువ్వు పసివాడివి. ఆవేశంతో ఏదో చేసెయ్యాలని తపనపడుతున్నావు. కానీ... ఇది. లోకం! కళ్ళకు పసర్లు కమ్మిన లోకం! దాని కంటికి నువ్వూ... నేనూ ... అందరం... పచ్చరంగుగానే కనిపిస్తాం... హు!" అదోలా అనుకుని నిర్లిప్తంగా నిట్టూర్చింది రత్నబాల. □